సాక్షి సూర్యాపేట

సోమవారం, 15, మే, 2023



వరి కొయ్యకాలు కాల్చొద్దు

వచ్చేనెల వానాకాలం సీజన్ ఆరంభం కానున్నందున కొయ్యకాలను కాల్చొదని నడిగూడెం ఏఓ సూచిస్తున్నారు.

- 8లో



యాదాద్రికి పోటెత్తిన భక్తులు

యాదాద్రి క్షేత్రానికి ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

- 10లో

గరిష్టం/కనిష్టం 44° / 27°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పూట సూర్యరశ్మి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నారసింహుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్ని హోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, గావించారు. స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్త్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం స్వామిఅమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. ఆ తర్వాత కల్యాణోత్సవంలో భాగంగా మాంగల్యధారణ, తలంబ్రాలతో వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణం నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాబాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అయ్యప్ప ప్రచారసభ జిల్లా అధ్యక్షుడిగా ముత్యంరాజు



ముత్యంరాజు

భానుపురి(సూర్యాపేట): అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా అధ్యక్షుడిగా రంగు ముత్యంరాజు గురుస్వామి నియమితులయ్యారు. ఈయన గతంలో ధర్మ ప్రచారం సభకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, శబరిమల ఏరిమెలి అన్నదాన భవన నిర్మాణ కమిటీ సభ్యుడిగా సేవలు అందించారు. ఇటీవల పూడూరు అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమలరావు, ప్రధాన కార్యదర్శి పుల్లంరాజుల నేతృత్వంలో కమిటీని నియమించారు. అలాగే జిల్లాకు చెందిన భూపతి శ్రీనివాస్ గౌడ్ గురుస్వామి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా మాశేటి నరేష్, సహాయ కార్యదర్శిగా ఎస్.శ్రీనివాస్, పీఆర్‌ఓగా రాపర్తి మహేష్‌కుమార్, కమాండెంట్‌గా సుంకాని శ్రీనివాస్‌లతో పాటు మరో 12మంది కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా రంగు ముత్యంరాజు మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో నాకు అప్పగించిన బాధ్యతను అంకిత భావంతో పనిచేసి ధర్మప్రచార సభ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్‌కు, రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

చిలుకూరు: విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని విశ్వబ్రాహ్మణుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రచారి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలంలోని కొండాపురం, ఆర్లెగూడెం, మాధవగూడెం, రామచంద్రానగర్ గ్రామాల్లో ఆ సంఘం మండల అధ్యక్షుడు అబ్బన పూర్ణాచారి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వ విశ్వబ్రాహ్మణులను చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. అనంతరం ఉమ్మడి గ్రామాల అధ్యక్షుడిగా కాసూరి బ్రహ్మం, ప్రధాన కార్యదర్శిగా అక్కినపల్లి వెంకటాచారి, కోశాధికారిగా నాగార్జునపు రామలింగాచారి, కార్యదర్శిగా మడూరి ఓంకారచారి, గౌరవ సలహాదారుడిగా మారోజు శ్రీనివాసచారిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నాగేంద్రచారిని సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

ప్రశాంతంగా ఎంసెట్ పరీక్షలు

కోదాడ అర్బన్: తెలంగాణ ఎంసెట్ పరీక్షలు ఆదివారం కోదాడ పట్టణంలో ప్రశాంతంగా సాగాయి. కోదాడ పట్టణంలో రెండు కేంద్రాల్లో విద్యార్థులు సకాలంలో హాజరై పరీక్షలు రాసినట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు. స్థానిక కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం జరిగిన పరీక్షకు 104మందికి 103 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహం పూట జరిగిన పరీక్షకు 104 మందికి 102 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. కాగా సనా ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 104 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 104మంది హాజరైనట్లు, మధ్యాహ్నం 104మందికి 103 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు కేంద్రం సూపరింటెండెంట్ గాంధీ తెలిపారు.

అడ్మిషన్లు పెరిగేలా..

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించేలా కార్యాచరణ సిద్ధం

- గ్రామాల్లో తిరిగి అవగాహన కల్పించనున్న లెక్చరర్లు
- నేటి నుంచి ఇంటర్ ప్రవేశాలు



సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

సూర్యాపేట టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు పెరిగేలా ఇంటర్ బోర్డు ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. సోమవారం నుంచి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్పించేందుకు ఆయా కళాశాల సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించేందుకు ప్రిన్సిపాళ్లు సన్నద్ధం అవుతున్నారు.

పల్లెల్లో అవగాహన కార్యక్రమాలు

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అధిక శాతం పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించి, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు స్పెషల్ క్యాంపెయిన్లు నిర్వహించాలని ఇప్పటికే ప్రిన్సిపాల్స్ నిర్ణయించారు. దీనికి అనుగుణంగా లెక్చరర్లు ఈనెల 15 నుంచి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లో అందే సౌకర్యాల గురించి వివరిస్తారు.

జిల్లాలో 40 కళాశాలలు

జిల్లాలో 7 జూనియర్ కళాశాలలు, 4 కేజీబీవీ, 4 మైనార్టీ వెల్ఫేర్ కళాశాలలు, 4 బీసీ వెల్ఫేర్ కళాశాలలు, 3 ఎస్టీ వెల్ఫేర్ జూనియర్ కళాశాలు, 8 ఎస్సీ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు, 9 మోడల్ స్కూల్స్, ఒకటి రెసిడెన్షియల్‌తో కలిసి 40 ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో చేరడం ద్వారా విద్యార్థులకు కలిగే ప్రయోజనాలేమిటి, రాయితీలేమైనా ఉన్నాయా వంటి అంశాలను వివరిస్తారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని విస్తృతంగా ప్రచారం చేయనున్నారు.

కార్పొరేటుకు దీటుగా విద్యాబోధన..

పేద విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గించేందుకు కార్పొరేట్‌కు దీటుగా విద్యనందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఫీజు లేకుండా ప్రవేశం కల్పిస్తూ.. ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేస్తారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత విద్యాబోధన, పరీక్ష సమయంలో విద్యార్థులకు స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. అంతేకాదు ఎంసెట్, ఐఐటీ, నీట్ వంటి ఉన్నత పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులు కొనసాగిస్తున్నారు. అలాగే వివిధ ఆర్థిక, కుటుంబ కారణాలతో టెన్త్‌తోనే కొంత మంది ఆడపిల్లలు చదువు మధ్యలోనే ఆపేయాల్సి వస్తుంది. అలాంటి వారి తల్లిదండ్రులకు తమ పిల్లలు బాగా చదువుకొని జీవితంలో ఉన్నతస్థాయి ఎదగడానికి అన్ని అవకాశాలు కల్పిస్తున్నారు. ముందుగా వీటిపై గ్రామాల్లో ప్రచారం చేస్తూ నే విద్యార్థులకు ఉపయోగపడేలా కార్యాచరణ అమలు చేస్తారు.

విద్యార్థులు వినియోగించుకోవాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందాలి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అన్ని సౌకర్యాలతో కూడిన విద్యాబోధన కల్పిస్తున్నాం. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు జూన్ 1నుంచి తరగతులను ప్రారంభిస్తాం. అదే నెలలో ప్రవేశాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కృష్ణయ్య, డీఐఈఓ, సూర్యాపేట

సరిహద్దు దాటి రాకుండా..

- తెలంగాణలోకి అక్రమంగా ధాన్యం తేకుండా పటిష్ట నిఘా
- రాష్ట్ర సరిహద్దులో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు
- 24 గంటలూ వాహనాల తనిఖీలు
- అనుమతి లేకుండా వస్తే వెనక్కి పంపిస్తున్న అధికారులు



ఇటీవల రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద చెక్ పోస్టును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కోదాడరూరల్ : ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి ధాన్యం అక్రమంగా రవాణా కాకుండా అధికారులు పటిష్ట నిఘా ఉంచారు. ముఖ్యంగా ఏపీ రాష్ట్రంలోని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి తెలంగాణలోకి ధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. దీంతో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మట్టపల్లి బ్రిడ్జి వద్ద రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ చెక్ పోస్టు వద్ద పోలీస్, రెవెన్యూ, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులు విడతల వారీగా 24 గంటలు విధుల్లో ఉంటు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు ముగిసేంత వరకు ఈ తనిఖీలు కొనసాగనున్నాయి.

ఏపీ నుంచి ధాన్యం రాకుండా..

తెలంగాణలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కొనన సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో ఎగుమతులు, దిగుమతులతో ఇబ్బందికర పరిస్థితి ఉన్నందున పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం అక్రమంగా రాష్ట్రంలోని మార్కెట్లోకు రాకుండా చెక్‌పోస్టుల అధికారులు తనిఖీలను ముమ్మరంగా చేస్తున్నారు. సరిహద్దులో ఉన్న కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడలో ధాన్యం మిల్లులు ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతాలకు ధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మిల్లులు ఉన్న ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో సరిహద్దు గ్రామాల రైతులు వారి బంధువుల పేర్లపై ఇక్కడ అమ్ముకునేందుకు వచ్చే అవకాశం ఉంది. ఈ విషయాలన్నీ పసిగట్టిన రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే ఏపీ నుంచి వచ్చే ధాన్యం వాహనాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ చెక్ పోస్టులనుఏర్పాటు చేసింది. ఇక్కడ డ్యూటీ చేస్తున్న సిబ్బంది లోడ్‌లతో వస్తున్న లారీ, ట్రాక్టర్ల పత్రాలను పరిశీలిస్తున్నారు. ఆ లోడ్లు ధాన్యం కాకపోతేను తెలంగాణలోకి అనుమతిస్తున్నారు.

ఇప్పటి వరకు వెనక్కు పంపిన ధాన్యం..

రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన రెండు చెక్‌పోస్టుల వద్ద ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా ఇప్పటి వరకు 28 వరకు ట్రాక్టర్ల ధాన్యం లోడ్‌లు, 2 లారీలను వెనక్కి పంపిచారు. అయితే పక్క రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యం వాహనాలను తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో అడ్డుకుని వెనక్కి పంపిస్తున్నారనే సమాచారాన్ని తెలుసుకున్న వ్యాపారులు, రైతులు ఇటు వైపు రాకుండా వెనుదిరుగుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ముగిసే వరకు తనిఖీలు



ఏపీ నుంచి తెలంగాణకు ధాన్యం అక్రమంగా రవాణా కాకుండా రాష్ట్ర సరిహద్దులో ప్రభుత్వం చెక్ పోస్టులు ఏర్పాటు చేసింది. మన దగ్గర ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ క్లోజ్ చేసేవరకు ధాన్యం రవాణాపై తనిఖీలు కొనసాగుతూనే ఉంటాయి.

– పాలెం రజిని, ఏఓ, కోదాడ

కమ్యూనిస్టులకు అండగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడే కమ్యూనిస్టులకు ప్రజలు అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఐలాపురం గ్రామంలో పలువురు సీపీఎంలో చేరారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో ఫాసిస్టు విధానాలు అవలంబిస్తూ, ప్రజల మధ్య మతం చిచ్చు రేపుతున్న బీజేపీకి ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రపంచ చరిత్రను గమనిస్తే సామాన్యులకు అండగా నిలిచేది ఒక్క కమ్యూనిస్టు పార్టీయేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర సభ్యులు డబ్బీకార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, బాబునాయక్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వడ్లకు రక్షణగా బతుకమ్మ చీరలు




కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులు నానా అవస్థలు పడుతున్నారు. తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఓ రైతు తన ధాన్యం రాశి తడవకుండా పట్టాలు కప్పి వాటిపైన కూడా ఇలా బతుకమ్మ చీరలు పరిచి ఉంచాడు.

– తిరుమలగిరి (తుంగతుర్తి)

యాదాద్రీశుడికి నిత్యపూజలు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. అర్చకులు వేకువజామునే ఆలయాన్ని తెరిచి సుప్రభాత సేవలు నిర్వహించారు. స్వయంభూవులకు ఆరాధన, బిందెతీర్థం, బాల భోగం, నిజాభిషేకాలు చేపట్టారు. స్వామివారికి సహస్ర నామార్చన చేసి తులసీదళాలను అర్పించారు. ఆలయ ప్రాకార మండపాల్లో శ్రీ సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు విశేషంగా జరిపించారు. ఆలయ ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన, అద్దాల మండపం వద్ద వేద ఆశీర్వచనం పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి స్వామి వారికి శయనోత్సవ సేవ నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు. అదేవిధంగా హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయంలోని ఆంజనేయ స్వామికి ఆకుపూజను వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



ఆంజనేయ స్వామికి హారతి పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

బీజేపీపై తిరుగుబాటు మొదలైంది

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



కుటుంబ సమేతంగా ఆలయంలోకి వస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల: బీజేపీపై ప్రజల నుంచి తిరుగుబాటు మొదలైందని, అందుకు కర్ణాటక శాసన సభ ఫలితాలే నిదర్శనమని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో నిర్వహించిన శ్రీహనుమాన్ జయంతి ఉత్సవాల్లో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. 108 వెండి తమలపాకుల తోరణాలను ఆంజనేయస్వామికి మొక్కుబడిగా చెల్లించారు. వారికి ఆలయ అర్చకులు లక్ష్మీ నర్సింహమూర్తి, ఈఓ నాగిరెడ్డి ప్రసాదం అందజేశారు. అనంతరం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి మంత్రి విలేకరులతో మాట్లాడారు. బీజేపీపై ఉనవ్యతిరేకతతోనే కర్ణాటకలో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని పేర్కొన్నారు. బీజేపీ అధికారమే లక్ష్యంగా తొమ్మిది రాష్ట్రాల్లో అప్రజాస్వామిక పద్ధతిలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని ఆరోపించారు. దేశంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని, ప్రజల్లో వ్యతిరేకత మొదలైనందున వచ్చే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుంకరి ధనమ్మయాదగిరిగౌడ్, నాయకులు కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, జనగాం నర్సింహగౌడ్, కల్లూరి మల్లారెడ్డి, కూరెళ్ల లింగస్వామి, దేవరపల్లి సత్తిరెడ్డి, బైకాని నాగరాజు, తుమ్మల నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి



స్వామివారిని దర్శించుకున్న కలెక్టర్ వెంకట్రావు దంపతులు

భానుపురి(సూర్యాపేట): జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో గల శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్దఎత్తున స్వామివారి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా భానుపురి హనుమాన్ చాలీసా భక్తబృందం, హనుమత్ దీక్ష భక్తబృందం, హనుమాన్ చాలీసా పారాయణ భక్తబృందంతో 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. దేవాలయ ప్రధాన అర్చకులు ధరూరి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం చేసి నాగవల్లి దళార్చన, వెండి తమలపాకులతో అర్చన, నూతన పతాకావిష్కరణ, వేద బ్రాహ్మణులు సుందరకాండ, విష్ణు సహస్ర నామ, భగవద్గీత, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె.వెంకట్రావు, సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వెంపటి సురేష్, బీఆర్ఎస్ నాయకులు మొరిశెట్టి శ్రీనివాస్, గండూరి కృపాకర్, గండూరి రమేష్, దేవాలయం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కొత్త ఆంజనేయులు, కార్యనిర్వాహణ అధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

యువత పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి(సూర్యాపేట): ప్రజా, నిరుద్యోగ సమస్యలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని ధర్మభిక్షం భవన్‌లో ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి బి.పి.నరేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ద్వితీయ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతూనే ఉన్నాయన్నారు. ఈ సభలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలుకల శ్రీనివాస్, కార్యదర్శి చేపూరి కొండల్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ మాజీ నాయకులు ఖమ్మం పాటి రాము, ఏఐఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్, ఏఐటీయూసీ ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, పాషా పాల్గొన్నారు.

హైవేపై వాహనాల రద్దీ



కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

కేతేపల్లి : హైదరాబాద్– విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ పెరిగింది. ఆదివారం కావడంతో పాటు శుభకార్యాలు ఉండడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వాహనాల్లో రాకపోకలు సాగించారు. దీంతో కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో విపరీతమైన రద్దీ ఏర్పడింది. జాతీయ రహదారి వెంట గ్రామాల్లోని జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటేందుకు ప్రజలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

ఇంటికిద్దరు చొప్పున జ్వరాల బారిన

- నారాయణపురం ఎస్సీ కాలనీలో ప్రబలుతున్న విషజ్వరాలు
- నెల పదిహేను రోజులుగా కాళ్లు, కీళ్ల నొప్పులతో నడవలేక అవస్థలు
- ముప్పై ఏళ్ల వయసు వారికి సైతం తప్పని ఊత కర్రల సాయం
- మొత్తం బాధితులు 400 మందికిపైగానే..



చిలుకూరు మండలం నారాయణపురంలో మంచం పట్టిన చెడపంగు ఆదెమ్మ

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామంలో గల ఎస్సీ కాలనీ వాసులు విషజ్వరాలు, టైఫాయిడ్ బారిన పడి మంచపట్టారు. తీవ్రమైన జ్వరం, కాళ్లు, కీళ్లు, కండరాల నొప్పులతో నానా అవస్థలు పడుతున్నారు. దీంతో మూడు పదల వయస్సులోని వారు సైతం చేతి కర్రసాయం లేనిదే నడవలేని పరిస్థితి నెలకొంది.

నెల పదిహేను రోజుల నుంచి..

గ్రామంలోని ఎస్సీ కాలనీలో మొత్తం 300 ఇళ్లు ఉంటాయి. సుమారుగా 750 వరకు జనాభా ఉంటారు. ఈ కాలనీలో సుమారుగా నెల పదిహేను రోజులుగా జనం విషజ్వరాలు, టైఫాయిడ్‌తో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మరికొందరు హుజూర్‌నగర్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందారు. అయినా జ్వరాలు తగ్గకపోవడంతో కొంతమంది ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించి వైద్యం చేయించుకున్నారు. మొత్తం మీద జ్వరాలు కొంత మేర తగ్గుముఖం పట్టినా కొంతమంది రెండోసారి టైఫాయిడ్ బారిన పడి బాధపడుతున్నారు. కాలనీలో ప్రతి ఇంట్లో ఒకరు లేదా ఇద్దరు చొప్పున దాదాపు 400 మంది వరకు జ్వరపీడితులు ఉన్నారంటే నమ్మశక్యం కాదు.

నొప్పులతో నడవలేని పరిస్థితి..

కాలనీ వాసులు నెల పదిహేను రోజులుగా కీళ్ల, కాళ్ల, కండరాల నొప్పులతో బాధపడుతూ కనీసం నడవలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఎక్కడా చూపించినా, ఎన్ని మందులు వేసుకున్నా ఆ మందుల ప్రభావం కొద్దిసేపు మాత్రమే ఉంటుందని, ఆ తరువాత యాథావిధిగా తీవ్ర స్థాయిలో నొప్పులు వస్తున్నాయని, బాధితులంతా సింగిల్‌గా నడవలేని స్థితి ఉండి కర్రల సాయంతో నడుస్తున్నారు. కీళ్ల నొప్పుల బాధితులంతా 30 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయస్సు వరకు ఉంటారు. కాలనీలలో మళ్లీ నాలుగు రోజుల జ్వరాలు వస్తున్నాయిని అంటున్నారు. రక్త పరీక్షలు చేసినా రిపోర్ట్స్‌లో ఏమి లేవని వైద్యులు చెబుతున్నారని, కానీ, నొప్పులు మాత్రం తగ్గడం లేదని బాధితులు అంటున్నారు. నెలా పదిహేను రోజులుగా జ్వరాలు, నొప్పులతో కూలీ పనులకు వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులకు వెళ్తే డబ్బులు వచ్చేవి, ప్రస్తుతం డబ్బులు రాకపోగా అప్పు చేసి వైద్యం చేయించుకోవవాల్సి వస్తుందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి కాలనీ వాసులందరికీ డాకర్లతో వైద్య పరీక్షలు చేయించి జ్వరం, నొప్పుల బారి నుంచి విముక్తి కలిగించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

కర్రసాయం లేకుండా నడవలేక పోతున్నాను



నెల రోజులుగా నాకు జ్వరం వస్తుంది. ఇప్పటికే పలుమార్లు ప్రైవేట్‌గా వైద్య పరీక్షలు చేయించుకున్నాను. రూ.10 వేల వరకు ఖర్చు వచ్చింది. కొన్ని రోజుల నుంచి జ్వరం కొంత తగ్గినా నొప్పులు మాత్రం తీవ్రంగా ఉన్నాయి. కర్ర సహాయం లేకుండా నడవలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వ వైద్యులు వచ్చి పరీక్షలు చేసి మా ఇబ్బందులు తొలగించాలి.

– బొల్లెపంగు జ్యోతి, ఎస్సీ కాలనీవాసి

నొప్పులు తీవ్రంగా ఉన్నాయి



నెల రోజుల నుంచి జ్వరంతో బాధపడ్డాను. హుజూర్‌నగర్ వైద్యశాలలో చూపించుకున్నాను. రూ.8వేల వరకు డబ్బులు ఖర్చు అయ్యాయి. అయినా నేటికీ కాళ్లు, కీళ్ల నొప్పులు తగ్గలేదు. నాతో పాటు కాలనీ వాసులు మొత్తం నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి నాణ్యమైన వైద్య పరీక్షలు చేయాలి.

– చెదపంగు పుల్లమ్మ, కాలనీవాసి

క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



కృష్ణకు సెల్‌ఫోన్ అప్పగిస్తున్న పోలీసులు

రాజాపేట: పోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు తిరిగి బాధితుడికి అప్పగించారు. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన కడవెరుగు కృష్ణ పవర్‌లూమ్స్ నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. కాగా, కొన్ని రోజుల క్రితం రూ.15వేల విలువగల తన సెల్‌ఫోన్ పోవడంతో పోలీసుకు ఫిర్యాదు చేశాడు. కాగా, సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా వెతికి పోయిన సెల్‌ఫోన్ కృష్ణకు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది గోవింద్, మారుతి అప్పగించారు. ఇందుకు పోలీసులకు కృష్ణ కృతజ్ఞతలు తెలిపాడు.

బత్తాయి చెట్లు దగ్ధం



దగ్ధమైన బత్తాయి చెట్లు

నల్లగొండ రూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో బత్తాయి చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ముశంపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జూలకంటి పెద్దిరెడ్డి తోటలోని చెట్లకు దుండగులు నిప్పు పెట్టడంతో సుమారు వంద వరకు కాలిపోయాయి. రూ.2లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. దుండగులపై చర్యలు తీసుకోవాలని నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఉద్యాన శాఖ అధికారులు నష్టం పరిహారం ఇవ్వాలని రైతు కోరాడు.

ఆలయాల్లో చోరీ



ఆలయంలో దుండగులు తెరిచిన హుండీ

కట్టంగూర్ : గుర్తుతెలియని వ్యక్తులు ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గౌడ సంఘం అధ్యక్షుడు కొంపెల్లి యాదయ్యగౌడ్, ఆలయ పూజారి శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని కురుమర్తి రోడ్డు వెంబడి ఉన్న కంఠమహేశ్వర స్వామి, శివాంజనేయ ఆలయాల్లోని హుండీలను శనివారం దుండగులు ధ్వంసం చేసి నగదును అపహరించుకుపోయారు. శివాంజనేయస్వామి దేవాలయంలోని హుండిని ఆలయ పక్కనే ఉన్న కంపచెట్లలో వదిలివెళ్లారు. ఈ ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మృత్యువాత



రమేష్ (ఫైల్)

బొమ్మలరామారం : చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఫక్కీరుగూడెం గ్రామానికి చెందిన కొలిపాక రమేష్(46) జోగు రామచందర్, జాంగీర్‌లు గ్రామ శివారులో గల షామీర్ పేట్ వాగులోని చెక్ డ్యామ్ వద్ద ఆదివారం చేపలు పట్టడానికి వెళ్లారు. ఈ క్రమంలో వాగులో వలను తీస్తుండగా కొలిపాక రమేష్ కాళ్లకు అది చుట్టుకోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడి కుమారుగు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం



వీరస్వామి (ఫైల్)

వలిగొండ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. వలిగొండ, గరిడేపల్లి, కోదాడ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన కడవేరు వీరస్వామి(55) కుటుంబ సభ్యులతో కలిసి టీవీఎస్ ఎక్సెల్పై ఉదయం యాదగిరిగుట్టలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో పులిగిల్ల గ్రామ సమీపంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పులిగిల్ల గ్రామానికి చెందిన నక్కల యాదిరెడ్డి టీవీఎస్ ఎక్సెల్ పైవచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వీరస్వామి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు.

లారీ ఢీకొని..

గరిడేపల్లి : గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన దాసోజు అంజయ్యచారి(53) కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వృత్తిలో భాగంగా పనుల నిమిత్తం నేరేడుచర్లకు వెళ్లాడు. హనుమాన్ జయంతి కావడంతో షాపు యాజమాని పనులు బంద్ చేయడంతో తిరిగి ఆర్టీసీ బస్సు ఎక్కి గరిడేపల్లి శ్రీ వెంకటేశ్వర హోటల్ వద్దకు చేరుకున్నాడు. ఈ క్రమంలో బస్సు దిగి రోడ్డు దాటుతుండగా నాగర్ కర్నూల్ నుంచి కోదాడ వైపు తవుడు లోడ్‌తో వెళ్తున్న లారీ అతివేగంతో వచ్చి ఢీకొనడంతో అంజయ్యచారి కిందపడిపోయాడు. దీంతో అతని కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో పోలీసులు అతడిని అంబులెన్స్‌లో తొలుత హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి అన్న వెంకటాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

కోదాడలో..

కోదాడరూరల్: కోదాడ పట్టణం గోపిరెడ్డినగర్‌కు చెందిన ఉమ(37) తన ఇంటి వైపు నుంచి ఆదివారం రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో ఖమ్మం క్రాస్‌రోడ్ నుంచి మేళ్లచెర్వు వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలు అయ్యాయి. ఆమెను తొలుత కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో ఖమ్మం తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పట్టణ పోలీసులు తెలిపారు.

మాతృదినోత్సవం రోజే తల్లి మృతి

- కన్నీరుమున్నీరైన చిన్నారులు
- గుర్రంపోడు మండలం పోచంపల్లిలో విషాదం



మంగమ్మ (ఫైల్)



అంత్యక్రియలు నిర్వహిస్తున్న చిన్నారులు

గుర్రంపోడు : అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. దీంతో ఆమె ఇద్దరు కుమారులు కన్నీరుమున్నీరై ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. గుర్రంపోడు మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన శెవ్వా మంగమ్మ(35) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఈమెకు భర్త, ఎని మిది, ఆరు సంవత్సరాల వయస్సు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నకుమారుడు తల్లికి తలకొరివిపెట్టాడు. మంగమ్మ భర్త అంజయ్యకు తోడ ఇద్దరు అన్నలు కూడా కొంత కాలం క్రితం మృతిచెందారు. వీరిది నిరుపేద కుటుంబం ఉన్న ఎనిమిది గుంటల భూమిని కూడా ఇటీవల విక్రయించి భార్యకు వైద్యం చేయించాడు.

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాములు దగ్ధం



చెరువుపల్లిలో దగ్ధమైన గడ్డివాములు

మాడ్గులపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో గడ్డివాముల దగ్ధమయ్యాయి. ఈ ఘటన మాడ్గులపల్లి మండలంలోని చెరువుపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చెరువుపల్లి గ్రామానికి చెందిన రైతులు కట్ట జాన్‌రెడ్డి, పోలబోయిన సైదులు యాసంగిలో వరి కోతల అనంతరం గడ్డి కట్టలను తమ పశువుల దొడ్ల పక్కన వాము వేసి ఉంచారు. ఈక్రమంలో ఆదివారం గడ్డివాముల పైనుంచి ఉన్న విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాసుకుని నిప్పురవ్వలు లేచాయి. దీంతో ఇరువురు రైతులకు చెందిన గడ్డి వాములకు నిప్పంటుకుని మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న మిర్యాలగూడ ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలం వద్దకు చేరుకుని మంటలు ఆర్పినప్పటికీ అప్పటికే రెండు గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి.

రైలులో మర్చిపోయిన బ్యాగు తిరిగి అప్పగింత

భువనగిరి : రైలులో మర్చిపోయిన బ్యాగును రైల్వే పోలీసులు తిరిగి అప్పగించారు. ఈ సంఘటన ఆదివారం భువనగిరిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లోని శ్రీరాంనగర్‌కు చెందిన సుందరి, పద్మ, సురేష్‌లతో పాటు మరో ఆరుగురు శనివారం సికింద్రాబాద్‌లో ఈస్టుకోస్టు రైలు ఎక్కి భువనగిరి రైల్వే స్టేషనలో దిగారు. అక్కడి నుంచి బస్సులో మోత్కూర్‌లో వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో తమ వెంట తెచ్చుకున్న బ్యాగును రైలు దిగే క్రమంలో అందులోనే మర్చిపోయినట్లు గమనించారు. వెంటనే రైల్వే స్టేషన్‌లో పోలీసులు తెలిపారు. విషయాన్ని కాజీపేట రైల్వే స్టేషన్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే రైలులో ఉన్న వ్యక్తులు బ్యాగు ఫొటో తీసి సంబంధిత వ్యక్తుల వాట్సాప్‌కు పెట్టారు. అప్పటికే అప్రమత్తమైన పోలీసులు కాజీపేట రైల్వే స్టేషన్‌లో బ్యాగును తీసుకున్నారు. అనంతరం బ్యాగును బాధితులకు అప్పగించారు. బ్యాగులో మూడు తులాల బంగారంతో పాటు కొంత నగదు ఉందని బాధితులు తెలిపారు.


ఎల్లమోనిగూడెం వాసికి డాక్టరేట్



కూర నర్సింహ

గుర్రంపోడు : మండలంలోని ఎల్లమోనిగూడెం గ్రామానికి చెందిన కూర నర్సింహకు ఉస్మానియా విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. నర్సింహ డాక్టర్ మురళీధర్‌రెడ్డి పర్యవేక్షణలో రసాయన శాస్త్ర విభాగంలో సినెర్జిటిక్ ఎఫెక్ట్ ఆఫ్ డోపింగ్ అండ్ డిఫెక్ట్స్ ఆన్ ఫొటోకాటలైటిక్ ఆఫ్ నానోస్ట్రక్చర్స్ (నానో నిర్మాణాల కాంతి ఉత్ప్రేరక చర్యలపై డోపింగ్, డిఫెక్ట్స్ సమష్టి ప్రభావం) అనే పరిశోధనకుగాను డాక్టరేట్ లభించింది. నిరుపేద కుటుంబానికి చెందిన కూర నర్సింహ విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగింది.

● ఆలోచింపజేస్తున్న కార్టూన్స్







రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఆలోచించు అనే కార్టూన్స్ సోషల్ మీడియాలో రెండు రోజుల నుంచి వైరల్ అవుతున్నాయి. ఈ ఆలోచించు అనే కార్టూన్స్ నేటి యువతకు, సమాజానికి చక్కటి మేసేజ్‌ను కలిగిస్తూ పలువురిని ఆలోపింపజేస్తున్నాయి. యువత పెడదోవ పడకుండా కార్టూన్స్ దోహదపడుతాయని ఎస్‌ఐ దొమ్మేటి నాగరాజు చెప్పారు.

– ఆత్మకూరు(ఎం)

వింత గొర్రె పిల్ల జననం

హాలియా : మండలంలోని చల్మారెడ్డిగూడెం గ్రామ సమీపంలో మహబూబ్ నగర్ జిల్లా నుంచి వలస వచ్చిన ఓ కాపరికి చెందిన గొర్రె వింత పిల్లకు జన్మనిచ్చింది. ఈ సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కొంత మంది గొర్రె కాపరులు మేత కోసం మండలంలోని చల్మారెడ్డిగూడెం గ్రామ సమీపానికి వలస వచ్చారు. శనివారం గ్రామ సమీపంలో గొర్రెల కాపరులు తమ మందను మేత మేపుతుండగా ఓ గొర్రె ఈనేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కాపరి గ్రహించి పశువైద్యశాలలో డాక్టర్‌ను సంప్రదించాడు. ఘటన స్థలం వద్దకు వెళ్లిన లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఎంఏ హమీద్ గొర్రెను పరిక్షించి శస్త్రచికిత్స చేయగా వింత పిల్లను జన్మనిచ్చింది. ఈ గొర్రె పిల్ల పుట్టిన కొద్ది గంటలకే మృతి చెందింది. మృతి చెందిన గొర్రె పిల్లకు ఆరు కాళ్లు, రెండు తోకలు, ఒక తల ఉన్నాయి. జన్యుపరంగా జరిగిందని ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం అరుదని లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఎంఏ హమీద్ పేర్కొన్నారు.

మైసిరెడ్డిపల్లి సర్పంచ్‌కు ఉత్తమ అవార్డు

బొమ్మలరామారం: మండలంలోని మైసిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ నోముల రమాదేవి ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన మాతృ దినోత్సవం కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ అరుణ బహుగుణ రమాదేవికి ఈ అవార్డు అందజేశారు. గ్రామంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు గుర్తింపుగా అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు.



రమాదేవికి అవార్డు అందజేస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ అరుణ బహుగుణ

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



ఆత్మకూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విసవరం కుటుంబ సభ్యులు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): విసవరం వారి సకుటుంబ ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం మండల కేంద్రంలోని పూర్వ విద్యార్థుల భవనంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన విసవరం కుటుంబ సభ్యులంతా ఒక్క చోటికి చేరుకున్నారు. పండుగ వాతావరణం నడుమ కలుసుకుని ఒకరి యోగా క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. కాగా ఇప్పటి వరకు పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరి సమ్మేళనాలు నిర్వహించుకోవడం చూడగా.. మొదటి సారి గ్రామంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న విసవరం, వారి ఆడబిడ్డల కుటుంబాలు కలిసి దాదాపు 500 మంది దాకా ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు.

జాతీయ రహదారులపై రద్దీ



చౌటుప్పల్ పట్టణంలో బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్, బీబీనగర్ : యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని హైదరాబాద్ – విజయవాడ, హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారులపై ఆదివారం ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ నెలకొంది. సెలవు రోజు కావడం, శుభకార్యాలు కూడా పెద్దఎత్తున ఉండడంతో హైదరాబాద్ జంటనగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజానీకం ఎక్కువగా రాకపోకలు సాగించారు. ఈక్రమంలో జాతీయ రహదారులపై వాహనాల రద్దీ ఏర్పడింది. బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద సాయంత్రం సమయంలో కిలో మీటరు మేర వాహనాలు బారులుదీరాయి. సాంకేతిక లోపాల కారణంగా ఫాస్టాగ్ స్కానింగ్ ఆలస్యంగా జరుగుతుండడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. ఇక చౌటుప్పల్ పట్టణ పరిధిలో జంక్షన్ల వద్ద రోడ్డు దాటేందుకు జనం ఇబ్బందులు పడ్డారు.

ధాన్యం బస్తాల తరలింపు పూర్తి

కేతేపల్లి : మండలంలోని కొండకిందిగూడెం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తరలింపు ప్రక్రియ పూర్తయింది. ధాన్యాన్ని తరలించేందుకు లారీలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి రైతులు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ కాళిందిని, డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీడీ సరస్వతి ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొండకిందిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ఉన్నారు. లారీల సప్లయ్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి ధాన్యం బస్తాలు తరలించేందుకు అవసరమైన పది లారీలను ఒకేసారి తెప్పించారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలన్నింటినీ మిల్లులకు తరలించారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తయినందున సోమవారం నుంచి కొండకిందిగూడెం కొనుగోలు కేంద్రాన్ని మూసి వేయనున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కేతేపల్లి తహసీల్దారు మధుసూదన్ రెడ్డి, డీటీసీఎస్ జావీద్, ఏఓ బి.పురుషోత్తం, ఏపీఎం యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

మోత్కూరు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. ఆయిల్ ఫెడ్ సంస్థ నుంచి మంజూరైన రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న భవన నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు, యువత, విద్యావంతులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక గ్రంథాలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని అన్నారు. పది వేల పుస్తకాలను సేకరించిన గ్రంథాలయ కమిటీ చైర్మన్ కోమటి మత్స్యగిరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి, వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, మార్కెట్ చైర్మన్ కె.యాకూబ్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మినర్సింహ్మారెడ్డి, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కె.అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, నేవూరి ధర్మేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు బొడ్డుపల్లి కళ్యాణ్‌చక్రవర్తి, లెంకల సుజాత, దబ్బెటి విజయ, కారుపోతుల శిరీషశ్రీనివాస్, మార్కెట్ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పొన్నబోయిన రమేష్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ గుర్రం లక్ష్మినర్సింహ్మారెడ్డి, రైతు బంధు మండల కోఆర్డినేటర్ కె.సోంమల్లు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ కమిటీ మెంబర్ దాసరి తిరుమలేష్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గనగాని నర్సింహ్మ, షాహిన్ సుల్తానా, ఆనందమ్మ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి



ర్యాలి నిర్వహిస్తున్న విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట పట్టణంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గుండ్లపల్లి నుంచి యాదగిరిపల్లి శివాలయం వరకు హనుమాన్ శోభాయాత్ర కొనసాగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ, కాంగ్రెస్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య, బీజేపీ రాష్ట్ర నాయకులు పడాల శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ తెలంగాణ సహకార్యదర్శి తోట భానుప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు కర్రె ప్రవీణ్, మండల అధ్యక్షులు బూడిద నరేష్, పట్టణ అధ్యక్షుడు సాయికిరణ్, భజరంగ్ దళ్ పట్టణ అధ్యక్షుడు కంసాని హరీష్, జిల్లా అధ్యక్షుడు కోకల సందీప్, మండల అధ్యక్షులు దూసరి ప్రవీణ్, సంతోష్, సాయి, సందీప్, ప్రవీణ్, శివ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

దేవరకొండ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులకు సూచించారు. ఆదివారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి ఆయా శాఖల అధికారులతో ఆయన ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. మిల్లర్లు ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేసుకోవాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 15 రోజుల్లో కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ గోపిరాం, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సివిల్ సప్లయీస్ డీసీఓ శ్రీనివాస్, డీఎం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వరి కొయ్యకాలను కాల్చొద్దు

- క్రిమి, కీటకాలు చనిపోయి పంటకు తీవ్ర నష్టం
- కొయ్యకాలను కుళ్లిపోయేలా చేసి దున్నితే మేలు
- నడిగూడెం వ్యవసాయాధికారి రాజగోపాల్ సూచనలు

పాడి పంట



కాలిపోయిన వరి కొయ్యకాలు

నడిగూడెం : రబీ సీజన్ వరి కోతలు పూర్తయ్యాయి. వచ్చే నెలలో ఖరీఫ్ సీజన్ ఆరంభమవుతుంది. రైతులు ఇప్పటి నుంచే పలు సాగు పద్ధతులు చేపట్టాలని, రబీలో కోసిన వరి కొయ్యకాలను తగలబెట్టకుండా కాపాడుకోవాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాల్ సూచిస్తున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే.. వరి కోతలు పూర్తయ్యాక ఎక్కువ మంది రైతులు వరి కొయ్యకాలకు నిప్పు పెట్టి బూడిద చేస్తుంటారు. అయితే ఇలా చేయడం వలన భూమిలో పంటకు ఉపయోగం అయ్యే క్రిమి, కీటకాలు కూడా చనిపోతున్నాయి. దీని వల్ల పంటకుతీవ్ర నష్టం జరుగుతుంది. దీర్ఘకాలంలో రైతు ఎక్కువగా నష్టపోతాడు.

వరి కొయ్యకాలను కాల్చడం ద్వారా సేంద్రియ కర్బన శాతం పెరిగి గాలిలో చేరి, కాలుష్యం ఏర్పడుతుంది. అలా కాకుండా వరి కొయ్యకాలకు నిప్పు పెట్టకుండా అలాగే ఉంచి కమతాల్లో నీరు చేర్చి వాటిని కుళ్లిపోయేలా చేసి, దున్నితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.

భూసారానికి ముప్పు

రబీ సీజన్ ముగిసింది. వచ్చే నెల ఖరీఫ్ సీజన్ ఆరంభం కానున్నది.రైతులకు తెలియక వరి కొయ్యకాలకు నిప్పు పెడుతున్నారు. ఇలా కాల్చడం వలన భూమిలోని సారంతోపాటు, మేలు చేసే క్రిములు చనిపోయి పంట దిగుబడి తగ్గుతున్నది. దిగుబడి కోసం రైతులు ఇతర క్రిమిసంహారక మందులు వాడడంతో పెట్టుబడి కూడా పెరుగుతుంది. అలాగే దున్నడం వలన సూక్ష్మపోషకాలు పెరుగుతాయి. భూసారానికి ఎంతో మేలు కలుగుతుంది. ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రాని సమయంలో వరి పంటను చేతులతో కోసేవారు. అలాగే మడులను నీరు పెట్టి కలియదున్నేవారు. దీంతో వరి మొదళ్లు మట్టిలో మక్కి భూసారం పెరిగేది. కానీ నేడు ఆధునిక యంత్రాలు అందుబాటులో రావడంతో వరి పంటను 15–30 సెం.మీ. పైకి మాత్రమే కోయడంతో వరి మొదళ్లు పెద్దవిగా ఉంటున్నాయి. ఒకప్పుడు మనుషులు కోసినప్పుడు పశుగ్రాసం కూడా అధికంగా లభించేది.

వరి కొయ్యకాలకు నిప్పు పెడితే..

- వరి మొదళ్లను కాల్చేయడం వల్ల మంటలు ఎగబడి వేడి తీవ్రతను సూక్ష్మజీవులు చనిపోతాయి.
- ఆశించిన మేర వరి పంట దిగుబడి రాదు.
- వరి మొదళ్లలో నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు సూక్ష్మజీవులు ఉంటాయి. మొదళ్లు కాల్చడం వల్ల ఈ పోషకాలు నేలలో కలవకుండా మంటలకు మాడిపోతాయి.
- తరచుగా గడ్డి కాల్చే పొలాల్లో నేల నీరు, గాలి వల్ల కోతకు గురవుతుంది. తద్వారా నేలపైన ఉండే సారవంతమైన పొర కొట్టుకుపోతుంది.
- పొలంపై గడ్డి తగలపెట్టడం వల్ల కాలుష్యం ఏర్పడుతుంది. తద్వారా గ్లోబల్ వార్మింగ్ ఏర్పడి వాతావరణం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం లేకపోలేదు.
- గడ్డిని తిని బతికే కీటకాలు, పశువులకు ఆహార కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఈ మంటలు వల్ల అకస్మాత్తుగా గ్రామాల్లో గుడిసెలకు మంటలు సోకి ఆస్తి నష్టం జరుగుతుంది.

వరి మొదళ్లను కలియదున్నడం వలన లాభాలు

- భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- నేలలో సేంద్రియ పదార్థం అందుతుంది.
- యూరియా, డీఏపీ, పొటాష్ వేయడం వల్ల ఎంత ప్రయోజనం చేకురుతుందో నేలకు అంత సేంద్రియ పదార్థం అందుతుంది.
- నేల కోతకు గురి కాకుండా ఉంటుంది.
- భూమికి నీటిని, పోషకాలను నిల్వ ఉంచే గుణం పెంచుతుంది.
- వాయు కాలుష్యం జరగకుండా ఉంటుంది.
- వరిగడ్డి మొదళ్లు పశువులకు మేతగా ఉపయోగపడుతుంది.
- కొయ్యకాలు కుళ్లడంతో పంటకు ఎరువుగా ఉపయోగపడి దిగుబడులు పెరిగే అవకాశం.